

వికలాంగుల ఉపకరణాలకు దరఖాస్తులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని పలు కేటగిరీలకు చెందిన వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, మూడుచక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంకకర్రలు, చేతికర్రలు, వినికిడి యంత్రాలు అవసరమైన వికలాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వికలాంగులశాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకరణాలు కావాల్సిన వారు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్‌లో గానీ సచివాలయంలో గానీ https://apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు నకలు, సదరం వైద్య, ఆదాయ, కుల ధ్రువపత్రం, తెలుపు రేషన్, ఆధార్ కార్డు, అంగవైకల్యంతో ఉన్న ఫొటోను వికలాంగులశాఖ ఎడి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఆధారంగా సంబంధిత ఉపకరణాలను అందజేయనున్నట్లు తెలిపారు.

పంచదారతోనే పండగ

- రేషన్‌లో బియ్యంతో పాటు అరకేజీ పంచదార పంపిణీ
- ఈనెలలోనూ కందిపప్పు లేనట్టే
- గోధుమపిండి, రాగులు పంపిణీ నిలిపివేత

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెలలో అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో బియ్యంతో పాటు పప్పు, పంచదార, నూనె, చింతపండు తదితర ఏడు రకాల వస్తువులు అందించేవారు. తర్వాత కాలంలో బియ్యంతో పాటు పప్పు, పంచదార, పండగ సమయాల్లో బెల్లం, నూనె, శనగలు, గోధుమలు తదితర వస్తువులు అదనంగా అందించేవారు. రేషన్ కార్డుదారులకు ఏడాదికి పైగా రాయితీ కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. గత నెల గోధుమపిండి, రాగులు ఇచ్చినా ఈసారి అవీ అందని పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా పంపిణీ ఆపేసినా దసరా పండగ నేపథ్యంలో ఈనెల పంచదార ఇవ్వాలని నిర్ణయించింది. బియ్యాన్ని యదావిధిగానే అందిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 1603 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,71,803 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 19,77,698 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 422 మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా అక్టోబరు నెల సరుకులను అందించనున్నారు. ఈ నెలలో బియ్యంతో పాటు కందిపప్పు, ఇతర సరుకులు అందిస్తారని అంతా భావించినా జిల్లాకు సరుకులు రాలేదు. పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఉన్నతాధికారులు సరుకుల కోసం టెండర్లను ఆహ్వానించినా సకాలంలో పూర్తి కాలేదని తెలుస్తోంది. దీంతో ఎప్పటిమాదిరిగానే కార్డులో ఎంతమంది సభ్యులు ఉంటే అన్ని కేజీల బియ్యం ఇవ్వనున్నారు. బియ్యంతో పాటు ప్రతి కార్డుకూ అరకేజీ చొప్పున పంచదార అందించనున్నారు. జిల్లాకు సుమారు 330 టన్నుల పంచదార కావాల్సి ఉండగా ఇప్పటికే 240 టన్నుల వరకు గోడౌన్లకు చేరింది. రెండు, మూడు రోజుల్లో మిగిలిన సరుకు వస్తుందని అధికారులు చెప్తున్నారు.



వాహనాల వద్ద సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

కందిపప్పు పంపిణీ ఎప్పుడో..?

ఇక లబ్ధిదారులు చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు అందుకోవడమే మరిచిపోయారు. గత ప్రభుత్వ హయాంలో 2023 జూన్ నుంచి డిసెంబరు వరకు కందిపప్పు సరఫరా చేయలేదు. పండగకు మాత్రం జనవరిలో పంపిణీ చేశారు. తర్వాత అక్కడ నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. మార్చి నుంచి జూన్ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో కందిపప్పు కొనుగోళ్లు, పంపిణీ అంశాలను ప్రభుత్వం పక్కన పెట్టింది. జూన్‌లో కొత్తగా కొలువు దీరిన టిడిపి కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా, అది కార్యాచరణకు నోచుకోలేదు. గత నెలలో కందిపప్పు అందుతుందని లబ్ధిదారులు ఆశించినా రేషన్ వాహనాల్లో ఇవ్వలేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండియు వాహనాల ద్వారా గతంలో రాయితీపై ప్రభుత్వం కేజీ రూ.67కే కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్‌లో పప్పు ధర అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం కందిపప్పు ధర రూ.180 నుంచి రూ.200కు చేరింది. పంచదార పరిస్థితి అలానే ఉంది. రాయితీపై అరకేజీ పంచదార రూ.17కే పేదలకు దక్కేది. ఇప్పుడు మార్కెట్‌లో రూ.22 వరకు పెరిగింది.

ఎండియుల పనితీరుపై మదింపు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు ఎండియు వ్యవస్థను 2021, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. రేషన్ డోర్ డెలివరీ కోసం ప్రభుత్వం రూ.5.83 లక్షల విలువైన వాహనాలను అందించింది. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు జిల్లాలో 422 మంది ఆపరేటర్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్‌కు ప్రభుత్వం రూ.16 వేలు వేతనంగా చెల్లిస్తోంది. ఇదంతా వృథా ఖర్చుగా కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లుగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు బట్టి తెలుస్తోంది. వీధిలో ఎక్కడో ఒక చోట వాహనం నిలిపి, ఒకట్రెండు రోజులు అందించి తర్వాత ఖాళీగా ఉంటున్నారంటూ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. దీంతో ఆపరేటర్ల పనితీరుపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఆపరేటర్ల రోజు వారీ పంపిణీ, పని గంటలు, ఉదయం ఏడు గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సాగించిన లావాదేవీల వివరాలను సేకరిస్తున్నారు. ఆపరేటర్ల సామర్థ్యం శాతం, యాక్టివ్, ఇన్‌యాక్టివ్ పంపిణీ గ్రాఫ్, తదితర అంశాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. దీని ఆధారంగా వాహనాల ద్వారా పంపిణీని ఆపేసి వారిని పలు డిపోలకు సర్దుబాటు చేయనున్నట్లు సమాచారం.



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

విషాదం


- పాఠశాల భవనం సన్‌షేడ్ కూలి విద్యార్థి మృతి
- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - రణస్థలం, శ్రీకాకుళం

రణస్థలం మండలంలోని పాతర్లపల్లిలో విషాదం చోటుచేసుకుంది. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనం సన్‌షేడ్ కూలి పదో తరగతి విద్యార్థి వనుం కృష్ణంరాజు (15) బుధవారం మృతి చెందాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థి కోరాడ శ్రీరామ్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా బాల్ నిర్మాణంలో ఉన్న భవనం సన్‌షేడ్ పైకి వెళ్లింది. బాల్‌ను తీసేందుకు పాతర్లపల్లికి చెందిన వనుం కృష్ణంరాజు, కోరాడ శ్రీరామ్ సన్ షేడ్ ఎక్కగా ఒక్కసారిగా కూలిపోయింది. కృష్ణంరాజు సన్‌షేడ్ కింద ఉండిపోగా, శ్రీరామ్ పక్కన పడిపోయాడు. అక్కడున్న విద్యార్థులు భయంతో కేకలు పెట్టడంతో ఉపాధ్యాయులు అక్కడకు చేరుకుని సన్‌షేడ్ కింద ఉన్న కృష్ణంరాజును బయటకు తీసి స్థానిక పిహెచ్‌సికి తరలించారు.



కూలిన సన్‌షేడ్



కృష్ణంరాజు (ఫైల్)

పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయాలపాలైన శ్రీరామ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. కృష్ణంరాజు మృతితో తల్లిదండ్రులు కనకారావు, లలిత భోరున విలపించారు. చదివి ప్రయోజకుడు అవుతాడనుకుంటే, అందనంత దూరాలకు వెళ్లిపోయాడని గుండెలు బాదుకుని విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కృష్ణంరాజు తమ్ముడు దుర్గాప్రసాద్ ఇదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి కనకారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

విద్యార్థి మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంఇఒ లావణ్య, సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని తల్లిదండ్రులను ఎమ్మెల్యే ఓదార్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు నాశిరకంగా ఉండడం వల్లే ఈ ఘటనకు కారణమని, ఆ పనులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మృతుని కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం

విద్యార్థి మృతిపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవనం సన్ షేడ్ కూలడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా రూ.ఐదు లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

విద్యార్థి మృతిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీనిచ్చారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన విద్యార్థి కోరాడ శ్రీరామ్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ షకీలాను ఆదేశించారు. పాఠశాలల భవన నిర్మాణ ప్రాంతాల్లో కంచెను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు అటువైపు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.



ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

ఎరువుల కోసం పడిగాపులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

రైతుల అవసరాలకు తగ్గట్లుగా ఎరువుల నిల్వలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్తున్నా... క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితులు ఉన్నాయి. ఎరువుల కోసం రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వజ్రపుకొత్తూరు పిఎసిఎస్ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరారు. 440 యూరియా బస్తాలు అందుబాటులో ఉండగా, రైతులు ఒకేసారి చేరుకోవడంతో గలాటా వాతావరణం నెలకొంది. డబ్బులు చెల్లించడానికి రైతులు కార్యాలయంలోకి ఒకేసారి చేరుకోవడంతో సిబ్బంది చేతులెత్తేశారు. పోలీసుల జోక్యంతో రైతులను వరుసలో పెట్టి రైతుకు ఒక్కో చొప్పున అందించారు. ఇప్పటివరకు మండల కేంద్రానికి 880 యూరియా బస్తాలు, 440 డిఎపి బస్తాలు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన ఎరువులు రైతాంగానికి ఏ మూలకూ సరిపోవని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన వారికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వేలో తప్పిదాలను నిరసిస్తూ రైతులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం అక్కడ్నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ భూముల రీ సర్వేలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీ సర్వేలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. భూ యజమానులకు న్యాయం చేయాలని, జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కర్లెమ్మ రెవెన్యూ పరిధిలోని సుమారు 1300 ఎకరాలు 500 మంది రైతులకు సంబంధించిన భూముల రికార్డులను రీ సర్వేలో ప్రత్యేక డిటి అనంతకుమార్, విఆర్ఒ రామారావు, సర్వేయర్ గిరిరాజు తారుమారు చేశారని ఆరోపించారు. అనంతరం తహశీల్దార్ బి.పాపారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు గేదెల కృష్ణారావు, పి.యతిరాజు, కె.సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

టెక్కలి ఉద్యానశాఖ డివిజన్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి ఉద్యానశాఖ డివిజన్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా గత ప్రభుత్వం టెక్కలి సహాయక ఉద్యానశాఖ అధికారి, సిబ్బందిని అల్లూరి జిల్లా పాడేరుకు కేటాయించి ఇక్కడి కార్యాలయాన్ని ఎత్తేసింది. టెక్కలి, ఇతర సమీప మండలాలు ప్రత్యేకించి ఉద్దానం ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో కొబ్బరి, జీడి, కూరగాయలు తదితర ఉద్యాన పంటలను పండిస్తున్నారని, రైతుల్లో సాంకేతిక విజ్ఞానంపై అవగాహన కల్పించి ఉత్పత్తి, ఉత్పాదకత, పంటల నాణ్యత పెంపొందించాల్సిన అవసరమున్న నేపథ్యంలో కార్యాలయాన్ని పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. కార్యాలయ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపింది. అందులో భాగంగా విజయనగరం జిల్లా ఉద్యానశాఖ ఎడి, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను టెక్కలికి కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం జిఒ నంబరు 599ను వెలువరించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే టెక్కలిలో ఉద్యానవన శాఖ ఎడి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా కోరారు. ఆయన చొరవతో వంద రోజుల్లోనే ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. ఇప్పటివరకు అన్ని జిల్లాల్లో జిల్లాకు ఒక ఉద్యాన శాఖ కార్యాలయం మాత్రమే ఉండగా, జిల్లాలో రెండు కార్యాలయాలు ఉండటం విశేషం. జిల్లాకు రెండో ఉద్యాన శాఖ కార్యాలయం ఏర్పాటు వల్ల ఉద్యాన రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఇళ్ల పట్టాను అందజేస్తున్న మంత్రులు, తదితరులు

మత్స్యకారుల ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మత్స్యకారుల ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మండలంలోని కుందువానిపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఉపాధి లేక వలసలు పోతున్నారని, మూలపేట పోర్టును ఏడాది లోగా మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు కూడా పూర్తయితే ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విశాఖపట్నం నుంచి మూలపేట పోర్టు వరకు బీచ్ కనెక్టివిటీ రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. రహదారి వెంబడి ఎన్ని లైట్లు అవసరమైతే అన్ని ఎంపీ నిధుల నుంచి ఇస్తానన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, అందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఉపాధి కోసం వెళ్లిన మత్స్యకారులు ఇటీవల శ్రీలంకలో చిక్కున్నారని, అలాంటి సమస్యల్లేకుండా చర్యలు చేపడతామన్నారు. హుదూద్ ఇళ్లను అర్హులైన అందిస్తామన్నారు. కుందువానిపేటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. గ్రామంలో గ్రౌండ్ ఏర్పాటుకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కుందువానిపేటలో నిర్మించిన హుదూద్ ఇళ్లను వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. మత్స్యకారులకు జెట్టీలు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యకార భరోసాపై సర్వే చేసి అర్హులైన వారికి ఇస్తామన్నారు. జిల్లాలో ప్రతి బీచ్‌కు ఒక రహదారి నిర్మిస్తామన్నారు. ప్రణాళికాబద్ధంగా జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం 66 మందికి తొలి దశలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ నగేష్, తహశీల్దార్ గణపతిరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఇ.రఘు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో వైఫల్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో వైఫల్యం చెందిందని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణ విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద పళ్లాలను గరిటెలతో కొడుతూ బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించామని కూటమి నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, పింఛను పెంపు తప్ప ఇంకే హామీ అమలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, పేదల బతుకులు మరింత దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథ్ మాట్లాడుతూ రైతుభరోసా, అమ్మఒడి, నిరుద్యోగ భృతి, గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఇసుక లభ్యం కాక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలవికాని హామీలిచ్చి ఇప్పుడు ఆర్థిక పరిస్థితి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగితే సిబిఐ విచారణను ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు ఈశ్వరి, ఆర్.సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

2 వరకు భగత్‌సింగ్, గాంధీ జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన భగత్‌సింగ్, మహాత్మా గాంధీ జయంతి వారోత్సవాలను ఈనెల 25 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో వారోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో కార్పొరేటీకరణతో విద్యా ఒత్తిడి వల్ల విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్నారని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ రహిత సమాజానికి ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందని చెప్పారు. అవసరమైతే పోలీస్ శాఖ సహాయం తీసుకుంటామని తెలిపారు. నేటి విద్యా విధానంలో విద్యా కాషాయీకరణ నేపథ్యంలో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రల స్థానంలో ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ పాఠాలను చేరుస్తోందని విమర్శించారు. భగత్‌సింగ్ వారసులుగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, శాస్త్రీయ విద్యను అందించేందుకు ఎస్ఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లాస్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, నాయకులు ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

ఎంఇఒ వైఖరిపై నిరసన

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎంఇఒ ఎ.త్రినాథరావు వైఖరిని మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం టీచర్ల సంఘాల ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో పలువురు టీచర్లు పాల్గొన్నారు. గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంప రమేష్‌పై ఎటువంటి కారణం లేకుండా మెమో అందజేయడంపై సంఘ ప్రతినిధులు మండిపడ్డారు. ఎంఇఒ వైఖరికి నిరసనగా త్వరలో దశల వారీగా తమ ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయమై అవసరమైతే ఆర్‌జెడి, డిఇఒ తదితర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. సక్రమంగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న రమేష్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడంపై సంఘ ప్రతినిధులు ఆగ్రహించారు. దశలవారీగా తమ ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సంఘ నాయకులు తెలిపారు. సమావేశంలో ఎపిటిఎఫ్, యుటిఎఫ్, పిఆర్‌పియు, ఎస్‌జిటిఎఫ్, ఆపస్, బిటిఎ, ఎస్‌సి, ఎస్‌టి తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

డిప్యూటీ డిఇఒ విచారణ

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలపై వచ్చిన పలు ఫిర్యాదులపై బుధవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి విచారణ చేపట్టారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థుల మధ్య కొట్లాటలో ఒక విద్యార్థి చేయి విరగడంతో దీనిపై తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు.

ఎండిఎంపై ఫిర్యాదు

పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనంపై కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు డివైఇఒకు ఫిర్యాదు చేశారు. సక్రమంగా వంటలు వండడం లేదని, తక్కువగా వండుతున్నారని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులను ఆమె ప్రశ్నించడంతో ఎండిఎం మార్పుపై ఎస్ఎంసిలో తీర్మాణం చేయడం జరిగిందని, త్రీమెన్ కమిటీ నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు పంపించామని ఎంఇఒ-2 రాజారావు, హెచ్ఎంలు తెలిపారు.

ప్రశాంతంగా చెకుముకి ప్రతిభా పరీక్ష



శ్రీకాకుళం అర్బన్ : పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



నౌపడ : విద్యార్థులతో మాట్లాడుతున్న మురళీధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ, మండంలోని పలు పాఠశాలల్లో, కార్పొరేట్ విద్యాసంస్థల్లో, ప్రయివేటు స్కూళ్లలో బుధవారం చెకుముకి ప్రతిభా పరీక్షలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను జిల్లా కన్వీనర్ పి కూర్మారావు, మండల కన్వీనర్ కష్టారావు, సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్, వి.ప్రసాద్‌లు పర్యవేక్షించారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత, బాలురు పాఠశాలల్లో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాల్లో కూర్మారావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, తార్కిక ఆలోచన, సృజనాత్మకతలకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అక్టోబరు 1న శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. నగరంలోని పాఠశాలల్లో 3,500 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానంపై ఆసక్తిని, శాస్త్రీయ వైఖరిని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం చేస్తాయని జన విజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు అన్నారు. బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ ఆవిష్కరించి పాఠశాల స్థాయి పరీక్షను ప్రారంభించారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచీ 8,9,10 తరగతుల విద్యార్థులు ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు పాల్గొన్నారు. నౌపడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పరీక్షను మండల కన్వీనర్ ఎం. అసిరినాయుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ టి.లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యులు గొంటి మురళీధర్, జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, హెచ్ఎం కోత చైతన్య అధ్యక్షతన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు, విద్యార్థుల్లో తార్కిక జ్ఞానం పెంపొందించుటకు ఏటా 8, 9,10 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, భాస్కరరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

మందస : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి చెకుముకి సంబరాల ప్రశ్నాపత్రాలను హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎల్.సాంబమూర్తి, ఎం.చక్రధరరావు విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జి.రమణబాబు, జి.తేజేశ్వరరావు, జి.కోదండరావు, పి.జగన్మోహనరావు, కె.శేషగిరిరావు, ఎస్.ప్రభాకరరావు, ఎస్.వేణుక, ఎస్.స్వప్న పాల్గొన్నారు.

టెక్కలి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన చెకుముకి సంబరాలు సందడి వాతావరణంలో ప్రారంభమయ్యాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షణలో ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో పరీక్షలు నిర్వహించామన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానంపై ఆసక్తిని, శాస్త్రీయ వైఖరిని పెంపొందించేందుకు చెకుముకి సైన్సు సంబరాలు దోహదం చేస్తాయని రాష్ట్ర పరిశీలకులు గొరిట మురళీధర్, జిల్లా అధ్యక్షులు కుప్పిటి కామేశ్వరరావులు అన్నారు. కోటబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టరును ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇందులో 91 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కె.ఆర్.కె. రెడ్డి, అరుణకుమారి, ఎర్రన్నాయుడు, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సంజీవరావు, ఆనందరావు, రమణమూర్తి పాల్గొన్నారు.



ఆమదాలవలస : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జనార్ధనరావు



సంతబొమ్మాళి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజు, తదితరులు



మందస : ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షను జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు పరిశీలించారు. ఈ పరీక్షకు 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు 50 మంది పాల్గొన్నారని హెచ్ఎం అప్పల రాములు తెలిపారన్నారు. అలాగే అక్టోబర్ 1న జరగనున్న మండలస్థాయి పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెవివి ప్రాంతీయ కమిటీ కోశాధికారి కూర్మాన షణ్ముఖరావు, ఉపాధ్యాయులు మోహనరావు, ఉమాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.రవి వెంకటాచలం

శ్రీకాకుళం అర్బన్ : ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమని రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవి వెంకటాచలం అన్నారు. వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ డే ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మల్లేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోగ నిర్ధారణ తర్వాత వైద్యులు అందించే వైద్యంతో పాటు రోగులు వాడే మందులివ్వడం ఎంతో కీలకమన్నారు. సర్వజనాసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ దాసరి షకీలా మాట్లాడుతూ కరోనా సమయంలో ఫార్మసిస్టులు పాత్ర మరువ లేనిదన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించారన్నారు. పెద్దఎత్తున వాక్సిన్ సరఫరాలోను కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ ఆస్పత్రి వైద్యం అందించడంలో ఫార్మసిస్టుల తోడ్పాటు కీలకమన్నారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ ఇన్ ఫార్మసీ బి.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ మనుషులకు ప్రాణం పోసేది వైద్యులైతే వారు వాడే మందులకు ప్రాణం పోసేది ఫార్మసిస్టులన్నారు. కార్యక్రమంలో డా.ఆర్.ప్రశాంత్, ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, రిమ్స్ ఆర్ఎంఒ డాక్టర్ బాల సుహాసిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనెల గోపాల్, బిఎస్ నాయుడు, జనార్ధన, రామారావు, రమేష్, ఆదిలక్ష్మి ప్రీతి, శ్రీనివాస్, ధనుంజయ చక్రవర్తి, గుంట సోమేశ్వరరావు, బి.నర్సింగరావు, శ్రావణి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఫార్మసీ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్



సింహాచలం (ఫైల్)

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలివాడకు చెందిన ఎందువ సింహాచలం (50) బుధవారం మృతి చెందాడు. సింహాచలం ఓ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఆయన మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పని ఉందని ద్విచక్ర వాహనంపై వచ్చి పని ముగించుకొని తిరిగి ఇంటికి పయనమయ్యాడు. అయితే దన్నానపేట పెట్రోల్ బంకు సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళు తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు గణేష్, నవీన్ ఉన్నారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారుడు గల్లంతు

సోంపేట : మండలంలోని బారువ కొత్తూరుకు చెందిన రట్టి అప్పన్న అనే మత్స్యకారుడు బుధవారం వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన రట్టి అప్పన్న, రటి వీరాస్వామి, ఎర్ర మోహనరావు లండయాథరావులు వేకువ జామున సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో బోటు బోల్తాపడటంతో అప్పన్న గల్లంతయ్యారయ్యారు. మిగతా ముగ్గురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అప్పన్న కోసం గాలింపు చర్యలు చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీ

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని మహదేవిపేట వీధికి చెందిన గుంటుకు జీవరత్నం మెడలో నుంచి బుధవారం ఉదయం దుండగులు ఐదు తులాల పుస్తెలతాడు, నల్లపూసలు చోరీ చేశారు. సంఘటనపై స్థానికులు, బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం సుమారు 10 గంటల సమయంలో హెల్మెట్ పెట్టుకున్న ఒక వ్యక్తి ఇంటికి వచ్చి మీ అబ్బాయి ఉన్నాడా? అని అడిగి, మంచినీళ్లు కావాలని కోరారు. ఇంతలో జీవరత్నం బాటిల్ తెచ్చేందుకు ఇంటి లోపలికి వెళ్లింది. అతడు ఆమె వెంటనే లోపలికి వెళ్లి జీవరత్నంను తోసివేసి మెడపై కత్తి పెట్టి పుస్తెలతాడు, నల్లపూసలు తెంపుకుని పారిపోయాడు. ఆమె ప్రతిఘటించడంతో చేతికి గాయమైంది. అనంతరం వీధిలోకి వచ్చి కేకలు వేయడంతో స్థానికులు గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ మంగరాజు, ఎస్ఐ హైమావతి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పక్కనే ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకు సిసి ఫుటేజీలో పరిశీలించి దుండగుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసిపేట జంక్షన్ వద్ద బుధవారం ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. వెంకటేష్ తెలిపారు. దూసిపేట గ్రామ సమీపంలోని నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి లారీతో రవాణా చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తెల్లవారు జామున దాడులు నిర్వహించి ఇసుక లారీని పట్టుకొన్నామని తెలిపారు. ఈ లారీ ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందినగా గుర్తించి లారీని పరిశీలించగా ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పోలాకి : ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తప్పవని ఎస్ఐ జి.రంజిత్ హెచ్చరించారు. మండలంలోని కొవిరిపేట, చీడివలస కూడళ్ల వద్ద బుధవారం తనిఖీలు నిర్వహించామని, ఈ తనిఖీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని తెలిపారు. ఈ ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్‌పిని కలిసిన కమ్యూనికేషన్ ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం



పూలమొక్కను అందజేస్తున్న సూర్యకుమార్

జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నార్త్ రీజియన్ (విశాఖపట్నం) కమ్యూనికేషన్ ఎస్‌పి జి.సూర్యకుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం కమ్యూనికేషన్ విభానికి సంబంధించి పలు అంశాలను చర్చించారు.

వాహనాల తనిఖీ

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో బుధవారం ఎస్ఐ ఎ.అహమ్మద్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ధ్రువపత్రాలు లేని వాహనదారులకు రూ.3 వేలు అపరాధ రుసుం విధించారు. వాహనదారులకు సంబంధించిన పత్రాలు ఉండాలని, హెల్మెంట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్మికులు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులను నియమించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, కె.వెంకటి, బి.కూర్మారావు కోరారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన కమిషనర్ ఎన్.రామారావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం అభివృద్ధి చెందుతుందని, దానికి తగ్గ కార్మికులను నియమించాలని అన్నారు. పనిముట్లు అందించాలని, ఆటోలు, ట్రాక్టర్లు, తోపుడు బల్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. 2011-12 ఏడాది పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.రవి, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

పలాస : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఉద్దానం మాజీ సైనికుల అసోసియేషన్ ఆర్థికసాయం వసూలు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను బుధవారం కలిసి రూ.21 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, కె.విశ్వనాథం, బి.వీరాస్వామి, కె.ఆదినారాయణ, కె.లింగమూర్తి, పి.కృష్ణారావు, కె.విజయకుమార్, పి.గిరిబాబు, కె.వల్లభరావు, ఎస్.రమేష్‌కుమార్, బి.మోహనరావు, కె.వల్లభరావు పాల్గొన్నారు.

రూ.50 వేలు...



చెక్కును అందజేస్తున్న భారతి, రేణుకేశ్వరరావు

కాశీబుగ్గ సాయి శిరీష స్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి, కవిటి రేణుకేశ్వరరావు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు సొంత డబ్బులు రూ. 50 వేలు అందజేశారు. దీనికి సబంధించిన చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందజేశారు. వరద బాధితులకు ఆదుకోవడంలో చంద్రబాబు ఎంతో శ్రమించారని అన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి



మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుపతిరావు

బూర్జ : ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో లబ్ధిదారులు తమ గృహాలు పూర్తి చేయాలని ఎంపిడిఒ పి. తిరుపతిరావు సూచించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి 227 గత ప్రభుత్వంలో అర్థాంతరంగా ఉన్న ఇళ్లు పూర్తి చేయాలన్నారు. గడువులోగా లబ్ధిదారులు తమ గృహాలను పూర్తి చేయకపోతే ఈ గృహాలను తొలగించే కార్యక్రమం చేపడతామన్నారు. గృహాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, హౌసింగ్ ఎఇ పి.లక్ష్మీనారాయణ, నాయుడు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ పిలుపునిచ్చారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సెక్రటరీ, సిఇఒ జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన బుధవారం మొక్కలను నాటారు. పాఠశాలలో పచ్చదనాన్ని పెంచేందుకు నాలుగు దశాబ్దాలుగా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలనా అధికారిని సయ్యద్ సుల్తాన్, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, రాము పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న జోహార్‌ఖాన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైద్యశిబిరానికి స్పందన

పొందూరు: మేజర్ పంచాయతీ పరిధిలోని ఎరుకులపేటలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి షుగర్, బిపి. రక్త పరీక్షలు వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.రమేష్ నాయుడు, డా.నవీన్ నాగపవన్‌కళ్యాణం, ఎఎన్ఎం మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రమాదేవి, హెల్త్‌అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం



మాట్లాడుతున్న సర్పంచ్ సునీత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పంచాయతీ ప్రథమ పౌరురాలైన దళిత సర్పంచ్ కుర్చీని సచివాలయం నుంచి టిడిపి కూటమి నాయకులు తీసేసి అవమానించారని పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పాతటెక్కలి సచివాలయం వద్ద తన అనుచరులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో కూటమి నాయకులు అరచకాలకు అడ్డూ అదుపు లేకుండాపోయిందని ఆరోపించారు. సచివాలయంలో తను సొంతంగా ఏర్పాటు చేసుకున్న కుర్చీని చెత్త ఎత్తుకొనే ట్రాలీలో తన ఇంటికి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి నాయకులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని వాపోయారు. సచివాలయ కార్యదర్శి కూటమి నాయకుల అడుగులకు మడుగులెత్తుతూ కుర్చీని చెత్త వాహనంలో ఇంటికి పంపించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇంతటి అన్యాయం, అరాచకం ఎప్పుడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిధులు తీసుకొచ్చి గ్రామ అభివృద్ధికి పాటుపడాలే తప్ప ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయాన్ని ఎంపిడిఒ, ఎస్‌సి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కొల్లి జోగారావు, ముద్దాడ దాలయ్య, పి.సత్యం, వెంకటరమణ, జానకిరావు, రమణ, పోలాకి కృష్ణ, తుంగాన హేమారావు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి బాల బాలికల క్రీడా పోటీలు బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆత్మస్థైర్యం మెరుగవుతుందని, గెలుపు ఓటములు అలవాటు చేసుకుంటే జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదుగుతారన్నారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.శోభారాణి, అపిటోరియా హెచ్ఆర్ మేనేజర్ కమలాకర రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, కూటమి నాయకులు లెంక శ్యాం, పిన్నింటి భానోజీనాయుడు, పోపూరి శివరామప్రసాద్, పిప్పల్ల వెంకటేష్, వడ్డాది శ్రీనివాసరావు, పిసిని జగన్నాథం నాయుడు, కనకారావు, సుంకరి ధనుంజయ్, గొర్లె సాయి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంపికైనట్లు పాతటెక్కలి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు పావని, భరత్, హైమవతి, నీరజ, చైతన్యలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రోజారాణిని అభినందించారు. ఇటీవల పలాస, గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

టెక్కలి: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి బాలికల క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. ఇందులో జిల్లాస్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు బాలికలను ఎంపిక చేసినట్లు కన్వీనర్ బాడాన నారాయణరావు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు ఎంపిక చేశామన్నారు. సుమారు 60 పాఠశాలల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టుని ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఇచ్ఛాపురం : స్థానిక సురంగిరాజ క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 263 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె.పద్మనాభంరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు.



సిఎం చంద్రబాబునాయుడుతో బాబూరావు తదితరులు

సిఎంను కలిసిన 'వజ్జ'

పలాస : ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ వజ్జ బాబూరావు సిఎం నారా చంద్రబాబుకు విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎపిటిపిసి చైర్మన్‌గా బాబురావును నియమించడంతో విజయవాడకు చేరుకుని చంద్రబాబును కలిశారు. సుమారు గంట పాటు తమతో చంద్రబాబు పలు విషయాలపై చర్చించారని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ త్రిపుల్ ఐటి విద్యార్థులు పల్లవి, సాయితారక్ ఈ నెల 23న శ్రీకాకుళంలో జరిగిన ఫెన్సింగ్ తైక్వాండో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపికకావడంతో పల్లవి, సాయితారక్‌లను డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అభినందించారు. మరింత ఉన్నతమైన స్థాయికి, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాజు, దిలీప్ కుమార్, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి పాల్గొన్నారు.

మంచం పట్టిన కిష్టుపురం

ప్రజాశక్తి- పలాస

ఆ గ్రామం జ్వరాలతో మంచం పట్టింది. ఎక్కడ చూసినా జ్వరాలతో రోగులు బాధపడుతున్నారు. గ్రామంలో వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మరవైపు పారిశుధ్య లోపం కనిపిస్తుంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పలాస మండలం కిష్టుపురంలో బి.కమల, ఎం.దేవి, బి.ప్రసాద్, ఆర్.సోనీ, బి.మాధవి ఇలా పదుల సంఖ్యలో రోగులు విష జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్య అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రయివేట్ ఆస్పత్రులకు ఆశ్రయిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు అవుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ఇంట్లో ఎవరికైనా జ్వరాలు జబ్బులు ఉన్నాయా? లేదా? సర్వే చేయాల్సి ఉన్నా... ఆ దిశగా వైద్య అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో రోగులు కాశీబుగ్గలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.



చికిత్స పొందుతున్న కమల

వైద్య అధికారుల నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారింది. మరోవైపు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రాగాలు బారిన పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని పదేపదే పంచాయతీ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామంలో పారిశుధ్య లోపం, వైద్య అధికారులు నిర్లక్ష్యానికి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ అధికారులు, పంచాయతీ అధికారులు చొరవ చూపి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై వెంకటాపురం పిహెచ్‌సి వైద్య అధికారి అంజలిని వివరణ కోరగా, గ్రామంలో జ్వరాలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. గురువారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వచ్ఛమైన దేశాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు కోరారు. బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆయన ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరసవల్లి మున్సిపల్ హైస్కూల్, శర్వాణి విద్యానికేతన్ యువ క్లబ్‌ల్లో సభ్యులుగా ఉన్న విద్యార్థులు పుష్కరిణి, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తోందన్నారు. పచ్చదనం - పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, స్వచ్ఛ సేవా కార్యక్రమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జ్యోతిర్మయి, శర్వాణి విద్యానికేతన్ ప్రతినిధి డి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఎచ్చెర్ల: శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఫార్మసీ కళాశాల దర్శకుడు డా.బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ వెంకటేశ్వర ఫార్మసీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వీరికి రెడ్‌క్రాస్ తరపున సర్టిఫికెట్, డోనర్ కార్డ్ అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పద్మశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ తారక రామారావు, కళాశాల ఫార్మా డి హెచ్‌ఒడి పైల భానోజీరావు, కలశాల యజమాన్యం, పెంకి చైతన్య, ఇతర సిబ్బంది, రెడ్‌క్రాస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పలాస : మండలంలోని రాకమృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో 8వ తరగతి చదువుతున్న కోట కల్పక్ హరీష్ కేథన్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి, ఎచ్చెర్ల ప్రభుత్వ హైస్కూల్ లో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సత్యసాయి విద్యా విహార్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికపై ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, వ్యాయమ ఉపాధ్యాయులు కిరణ్, దేవ అభినందించారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదిన జయంతిరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.చలపతిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.ఆంజనేయులు 'ఎస్సెన్షియల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ బ్లాక్ చైన్' అనే నూతన పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీపై అధునాతన పద్ధతులు ఉపయోగించి నేరాలను అదుపు చేయుటకు సంబంధించిన అధ్యయనం చేసే బిటెక్ మూడు, నాలుగు ఏడాది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని పుస్తకాలను రచించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెస్టా డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్, హెచ్ ఒడి డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు.

'వైసిపి కార్యకర్తలకు భరోసా'

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని, ఇటువంటి సంఘటన పునరావృతమైతే ఆందోళన చేస్తామని వైసిపి నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య హెచ్చరించారు. మండలంలోని దూకులపాడులో కార్యకర్తలతో కలిసి వైసిపి కార్యకర్తలకు భరోసా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైసిపి నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బగ్గు రమణయ్య, సర్పంచ్ అల్లు అసిరినాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు పాగోటి గోవిందరావు పాల్గొన్నారు.

సామూహిక ప్రతిజ్ఞ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం డైలీ మార్కెట్ పరిసర ప్రాంతాలను బుధవారం శుభ్రం చేయించారు. అనంతరం మార్కెట్ వర్తకులతో సామూహిక స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, సచివాలయ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో 'మీకు తెలుసా'

సోంపేట : మండలంలోని కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై ఎఎన్‌ఎం లకు, ఆశావర్కర్లకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ సంజన ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. డాక్టర్ పద్మ ఎసిటిసి సెంటర్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులపై సమాజం చూపించాల్సిన ప్రవర్తనపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ హెజిబుల్ మాట్లాడుతూ వ్యాధి సోకినవారు తీసుకోవలసిన జాగ్రత్తలు, మందుల గురించి తెలియజేశారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

మెళియాపుట్టి: మెళియాపుట్టి ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, మండల పరిషత్ ఎఒగా ఎస్.రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాతపట్నం ఎంపిడిఒగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎంపిడిఒ పడాల చంద్రకుమారి పాతపట్నం బదిలీ అయ్యారు. కార్యదర్శులు అప్పారావు, శివాజీ, పోలాకి మోహనరావు, ఢిల్లేశ్వరరావు, వనజాక్షి, ధనలక్ష్మి, సరోజిని పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

బూర్జ : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.తిరుపతిరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల మండల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ఎఒగా పనిచేశారు.

నిధులు మంజూరు చేయాలి

టెక్కలి: టెక్కలిలో నూతన కోర్టు భవనాల సముదాయాలకు అవసరమైన పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద కోరారు. బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు పనిచేసేందుకు అనుకూలంగా లేవన్నారు. వర్షాలు కురిసే సమయంలో నీరు చేరిపోవడంతో విధులకు ఆటంకాలు ఉంటున్నాయన్నారు. పాత భవనాలు కావడంతో సిబ్బంది, న్యాయవాదులు భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. నిధులు మంజూరు చేయాలని, సీనియర్ సివిల్ జడ్జి పోస్టు భర్తీ చేయాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమానికి అవసరమైన వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించినట్లు వివేకానంద తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎస్.దివాకర్, డి.ధర్మారావు, పేడాడ బాబూరావు, పి.సాయిరాజ్, ఎం.గోవింద్, బాలకృష్ణ, పైల చంద్రుడు, మల్లేశ్వరరావు, పొట్నూరు ఆనంద్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

పాతపట్నం : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.శ్రీనివాస్ సూచించారు. స్థానిక కిరణ్మయి జూనియర్ కళాశాలలో గంజాయి, పొగాకు, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు అలవాటులకు బానిసలు కావద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక కాంతి నికేతన్ జూనియర్ కళాశాల, సాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై బుధవారం ఎస్ఐ చిరంజీవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం చాలా ప్రభావితం చేస్తోందని, మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. చదువుపై శ్రద్ధ వహించి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్ట ప్రకారం నేరమని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన



జలుమూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- జలుమూరు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సిఎం చంద్రబాబు నాయుడు సంతృప్తికర పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అవ్వ తాతల పింఛను రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, లక్షలాది మంది పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, యువత భవిష్యత్‌కు డిఎస్‌సి, ప్రజల ఆస్తుల భద్రతకు ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు వంటి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, సర్పంచ్‌లు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

ఆమదాలవలస: గత ప్రభుత్వంలో చెల్లించిన మాదిరిగా తనకు టిఎస్‌ఆర్ ట్యాక్స్ కట్టనవసరం లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తోటాడ, అక్కివరం పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటాడకు చెందిన తమ్మినేని సురేష్ రోజువారి కూలి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి కిందకు పడిపోవడంతో చేతులు, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో పనికి వెళ్లలేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని రవికుమార్ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కివరంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేనెంబర్ 121 భూమిని జిరాయితీ భూమిగా న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని, రెవెన్యూ అధికారులు నేటివరకు ఆ సమస్యను పరిష్కరించలేదని రైతు పొన్నాడ గణపతిరావు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రవికుమార్ తహశీల్దార్ రాంబాబును వివరణ కోరగా సర్వే నెంబర్ 121లో 200 ఎకరాల భూమిని 22ఎ ఐడిలో అప్పట్లో పాలకులు, అధికారులు పెట్టారని దానివలన నేటికీ ఈ సమస్య పరిష్కారం కాకుండా ఉండిపోయిందన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ 121 సర్వే నెంబర్‌లో ఉన్న భూమి జిరాయతీనేనని అన్నారు. ఈ భూమికి సంబందించిన రికార్డులను తనకు అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తానన్నారు. గతంలో కొంత మంది పెద్దలు అప్పట్లో తోటాడ, అక్కివరం గ్రామాలు ఇనాం భూములని తప్పుడు అఫిడవిట్‌లు వేయడంతో సమస్య ప్రారంభమైందన్నారు. ప్రజల తరపున సిఎం, భూ పరిపాలన కమీషనర్ తదితరులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, హనుమంతు బాలకృష్ణ, బెండి రామ్మోహన్, తాంద్ర హరిబాబు, గురుగుబెల్లి నీలారావు, కంచరాన లోకేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

పలాస : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని బ్రహ్మణతర్లాలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మొక్కలను నాటారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అలాగే ఐసిడిఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి లక్ష్మణరేఖ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పెనుబర్తిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కూన వెంకట సత్యనారాయణ ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, సెక్రటరీ నాగరాజు, సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు కార్జీ వీధిలో ఇది మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి నందిక జాని, నందిగామ కోటి, బత్తిన కృష్ణయ్య, ఆశి తులసయ్యరెడ్డి, ఎం.ధర్మరాజు, రొక్కాల భాస్కరరావు, ఎస్.ఎన్.పండా, యలగల రాజు తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ పంచాయతీ జగన్నాథపురం, పాలవానిపేట, కూర్మనాథపుర గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌరీవరప్రసాద్ బాబ్జి, మహంతి రాజు, బాలకృష్ణ, శంకర్, నాగిరెడ్డి, రాజు, కామరాజు, తేజ, కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి పాల్గొన్నారు.

టెక్కలి : టిడిపి కూటమి ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని టెక్కలి మాజీ సర్పంచ్ బెహరా కృష్ణవేణి అన్నారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా పట్టణంలోని భూలోకమాత, సర్వమంగళ, మెట్ట వీధుల్లో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెహరా కాళి, ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మిపురం, చాపర, సవర కోలిగాం పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ బూర్ల లలితకుమారి, రమేష్, పడాల శ్రీను, మజ్జి పోలినాయుడు, దారపు దామోదర్, అంపోలు లావన్న, ఎస్.ఆనందరావు, కార్యదర్శి, విఆర్‌ఒ పాల్గొన్నారు.



ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్



పలాస : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

అరసవల్లి సందర్శించిన ఆర్‌జెడి

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాజమహేంద్రవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు సందర్శించారు. వారిని ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు. ఆయనతో పాటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ బి.ఆర్.వి.వి.ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఇఒ డి.ఎల్.వి. రమేష్ బాబు ఉన్నారు.

రికవరీ విధానం విడనాడాలి

శ్రీకాకుళం అర్బన్: ఆర్‌టిసిలో పని చేస్తున్న ఉద్యోగుల నుంచి టైర్లు, స్ప్రింగ్ ప్లేట్లు, గ్లాస్ డ్యామేజీలు, బస్సు డ్యామేజీలు, టిమ్స్ డ్యామేజీల పేరుతో జీతాల్లో కోతలు పెట్టడం తగదని, ఈ విధానాన్ని ఆర్‌టిసి అధికారులు విడనాడాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలిశెట్టి దామోదరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డబ్బులు కడితే తప్ప డ్యూటీలకు తీసుకోమని, డిపోల్లో స్పేర్‌గా ఉంచుతామని బెదిరించడం తగదన్నారు. డబ్బులు కట్టలేని ఉద్యోగులకు చార్జి షీట్లు ఇచ్చి ఫైనల్ ఆర్డర్స్ ద్వారా జీతాల నుంచి రికవరీలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రాజు

పాతపట్నం : పాతపట్నం మండలం సబ్ రిజిస్టర్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.రాజు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కోటబొమ్మాళి మండలంలో సబ్ రిజిస్టర్ ఆఫీసర్‌గా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లావేరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లావేరు ఎంఇఒ లండ ఈశ్వరరావు కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం జి.జి.వలసలోని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను ఎంఇఒ తండ్రి సూరీడును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు యినపకుర్తి సతీష్, పైడి దాము, దుర్గాసి రామారావు, లంకలపల్లి మహేష్, మహదాసు చక్రధర్, అప్పలరాజు, దుర్గారావు, నారాయణరావు ఉన్నారు

రేషన్ డిపో తనిఖీ

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ ఆరో వార్డు రేషన్ డీలరు రొక్కం శ్రీనివాసరావు షాపును సివిల్ సప్లయి అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఏడు క్వింటాళ్ల 25 కేజీల బియ్యం స్టాక్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే చోట్లు ఇచ్చినట్లు గేటు పాసులు ఇచ్చి ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని గుర్తించారు. అనంతరం డీలర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తనికీలో ఎసిఎస్ఒ విష్ణు చరణ్ పానీగ్రాహి, కాశీనగర్ సివిల్ సప్లయి ఇన్‌స్పెక్టర్ కుమార్ పోరిడా పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితులకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ, బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు కేటాయించిన భూముల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపిటిసి మద్దిల పాపారావు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఎంఐజి లేఅవుట్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం నిర్మాణం అవుతున్న టిడ్కో ఇళ్లకు ఇచ్చిన భూముల రైతులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ కాలనీకి 50 ఎకరాలు తీసుకున్నారని, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని, వెంటనే స్పందించి చెల్లించాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ... బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తహశీల్దార్ బి.సత్యం, డిటి లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ గిరి, ఆర్ఐ నిరంజీన్‌ను కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్, ఎంపిటిసి మాజీ సభ్యులు మద్దిల రామారావు, బాధిత రైతులు మద్దిల మల్లేశ్వరరావు, మెట్టూరు అప్పారావు పాల్గొన్నారు.



మృతి చెందిన గొర్రెలు

దిమ్మిడిజోలలో గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని దిమ్మిడిజోలో వింత వ్యాధితో గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. గ్రామానికి చెందిన ఆవాల సూర్యనారాయణ, తాడేలా కృష్ణారావు, ఆవాల కృష్ణారావులకు చెందిన గొర్రెలు గత నాలుగు రోజులుగా వింత వ్యాధి బారిన పడి దఫదఫాలుగా ఇప్పటి వరకు 60 గొర్రెలు మృత్యువాత పడ్డాయని బాధితులు వాపోతున్నారు. దీంతో రూ.3 లక్షల వరకు నష్టపోయామని బాధితులు లబోదిబోమంటున్నారు. తక్షణమే ప్రభుత్వం ఆదుకుని ఆర్థికసాయం అందజేయాలని కోరారు. దీనిపై అసిస్టెంట్ సహాయ సంచాలకులు ఎం.రవికృష్ణను వివరణగా కోరగా, కోలి బేసిలోసిస్ వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. నాలుగు రోజులుగా చికిత్స అందిస్తున్నామని అన్నారు. మేతకు వెళ్లిన సమయంలో పచ్చగడ్డితో పాటు ఇసుకను తినడంతో అనారోగ్యానికి గురైన కొద్ది గంటల్లోనే మృత్యువాత పడుతున్నాయని తెలిపారు.

అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలి

ఇచ్ఛాపురం : మండలంలోని బిర్లంగి, తోటవూరు గ్రామాలకు అంగన్వాడీ మండలంలో గతంలో బిర్లంగి తోటవురు గ్రామానికి అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయని, వాటిని నిర్మించాలని బిజెపి నాయకులు లక్ష్మారెడ్డి, మంగి లక్ష్మి కోరారు. ఈ మేరకు సిడిపిఒ నాగరాణిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఉన్నారని అన్నారు. వారు ఉండడానికి, పిల్లలు చదవడానికి ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవని, అందుకు సొంత భవనం నిర్మించాలని వారు కోరారు.

ఎపిఎంగా రామమూర్తి

పొందూరు: ఐకెపి ఎపిఎంగా రుప్ప రామమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎచ్చెర్ల ఎపిఎంగా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎపిఎంగా పనిచేస్తున్న గురుగుబెల్లి శ్యామలరావు ఆమదాలవలసకు సిసిగా బదిలీ అయ్యారు.

హౌసింగ్ ఎఇగా రమేష్

లావేరు: లావేరు మండల హౌసింగ్ ఎఇగా మహదాసు రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు జి.సిగడాం మండల ఎఇగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రమేష్ టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్‌ను తాళ్లవలసలో ఆయన నివాసంలో కలిశారు.


ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

శ్రీకాకుళం అర్బన్: ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు పేర్కొన్నారు. పాలిథిన్ కవర్లు నిషేధంలో భాగంగా స్టీల్ బాక్స్‌ను వినియోగిస్తూ మాంసం దుకాణంలో తన బాధ్యతను నిర్వర్తించారు. బుధవారం ముందుగా నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లో వ్యాపారుల వద్ద ఉన్న పాలిథిన్ కవర్లను తీసుకొని కవర్ల వినియోగం వలన కలిగే నష్టాలపై వారికి వివరించారు. పెద్దఎత్తున ప్లాస్టిక్ సంచులు వాడి బయట పడేయడం వలన ఎక్కడికక్కడ కాల్వల్లో పెద్దఎత్తున పూడుకు పోతున్నాయన్నారు. దీనికి తోడు మురుగు నీటిని భూమిలోకి వెళ్ల నీయకుండా ఈ కవర్లు అడ్డుకుంటున్నాయని, ఎక్కడికక్కడ వ్యర్థ జలాలు నిల్వ ఉండి దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలు తెలిచ్చి పెడుతున్నా యన్నారు. దీనికితోడు భూగర్భజలాలు పెద్దఎత్తున కలుషితమవు తున్నాయన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణాన్ని దెబ్బ తీయడమే కాకుండా జీవులపై ప్రతికూల ప్రభావం చూపు తుందన్నారు. కేన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవు తున్నాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలన్నారు. స్టీల్ బాక్సులు వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.గణేష్ కుమార్, ఆర్‌ఐలు ఉమామహేశ్వరరావు, నరేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారుల వద్ద నుంచి ప్లాస్టిక్ కవర్లు తీసుకుంటున్న కమిషనర్

ఇంటి పన్ను వసూలు వేగవంతం




రికార్డులను పరిశీలిస్తున్న రమణ

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ టెక్కలిలో ఇంటి పన్నులు వసూలు చేసి అభివృద్ధి పథంలో నడపాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24కు సంబంధించి రూ.కోటి వసూలు చేయాల్సి ఉందన్నారు. పంచాయతీ ఆదాయాన్ని మెరుగుపరిచి పారిశుధ్య కార్మికులకు జీతాలు నెలవారి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీకి సంబంధించిన షాపుల అద్దెల వసూలుపైనా దృష్టి సారించాలన్నారు. చెత్త సేకరణ కేంద్రాలు వినియోగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలన్నారు. ఇఒ కె.వి. జగన్నాథరావు, జూనియర్ అసిస్టెంట్లు శశి, జోగారావు పాల్గొన్నారు.

సమన్వయంతో ఘనంగా ఉత్సవాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే కొత్తమ్మ తల్లి ఉత్సవాలను సమన్వయం, అందరి సహకారంతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో బుధవారం సమీక్షించారు. సామాన్య యాత్రికులకు సులభతరంగా దర్శనానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీ అధికారులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో అక్రమ నిర్మాణాల జాబితాలను తయారు చేయాలని ఆదేశించారు. కొండ ప్రాంతంలో అనుమతుల్లేని తవ్వకాలు, నిర్మాణాలపై దృష్టిసారించాలని సూచించారు. కోటబొమ్మాళి పాఠశాల ఆవరణలో కీ.శే కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట పోడియం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తొలుత ఎపిఎస్‌డబ్ల్యుసి విజయవాడ విశ్రాంత జనరల్ మేనేజర్ రూ.1.30 లక్షల చెక్కును విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సమగ్ర సర్వే నిర్వహించాలి

ఇచ్ఛాపురం : గ్రామాల్లోని ప్రజల అవసరాలను గుర్తించే సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఎపిఎం ప్రసాదరావు సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. అంతకుముందు రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లకు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువులు పూర్తిగా తొలగించి జీవ ఎరువులు ప్రాధాన్యతను వివరించారు. ప్రతి సంఘ సభ్యులు పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాల పండించడం, చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సహించా లన్నారు. ప్లాస్టిక్ నిషేధించడం, సంఘ లావాదేవీలు, రైతు ఉత్పత్తిదారుల సమైక్యకు ప్రతి సభ్యులూ సభ్యత్వం, వాటా ధనం చెల్లించాలన్నారు. తద్వారా ప్రభుత్వం ద్వారా రానున్న వివిధ పథకాలు అందరిరూ పొందేలా అవగాహన కల్పించారు. సిసిలు మోహనరావు, లక్ష్మి, మోహిని, విష్ణు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

పలాస: నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ సురేష్ అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి కార్యాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువగా ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 128 నేత్రాలను పరీక్షించగా, 60 మందిని శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు కన్వీనర్ డోకి జగదీష్, జిల్లా సాధన శిబిరం ఇన్‌ఛార్జి శ్రీనివాస్, బి.కామేశ్వరరావు, తర్లాన రమేష్, ఎం. కామేశ్వరరావు, ఎం.రామేశ్వరరావు శంకర్ ఫౌండేషన్ క్యాంపు జూనియర్ మేనేజర్ సాయికుమార్, కో-ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌పి బాలుకి నివాళి

ఇచ్ఛాపురం : పాటల మాంత్రికుడు కీర్తిశేషులు పద్మభూషణ్ బాల సుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని స్థానిక వెంకటేశ్వర మ్యూజిక్, డాన్స్ అకాడమి సభ్యులు బుధవారం నిర్వహించారు. ముందుగా బాలు చిత్రపటానికి అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పెండింగ్ బిల్లుల వివరాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2014-19 మధ్య కాలంలో అప్పటి టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ పెండింగ్ బిల్లులతో పాటు రికవరీ జాబితాలను అందజేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలను బుధవారం నిర్వహించారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కూన రవికుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ వద్ద 2014-2019 మధ్య చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులో అడ్డంకులు తెలపాలన్నారు. విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు చేపట్టిన రికవరీ వివరాలు లిఖితపూర్వకంగా అందించాలన్నారు. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అవసరమైన 400 కెవి విద్యుత్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమగు నిధులు సమకూర్చేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. నీటి పారుదల శాఖ పరిధిలో శివారు ప్రాంతాలకు ఈ ఏడాది ఖరీఫ్ పూర్తయ్యేంత వరకు సాగునీరు అందించాలని సూచించారు. చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ సాగునీరందించడంలో నిర్లక్ష్యం వద్దని, కాలువల మరమ్మతులు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి అన్ని ప్రాంతాల రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పర్యాటక శాఖ పై జరిగిన సమీక్షలో రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకే టూరిజం పనులను పరిమితం చేశారని, మిగిలిన ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో అక్రమ లే అవుట్లలో చేపట్టిన నిర్మాణాలపై పన్నుల వసూళ్ల వివరాలు తెలియజేయాలని డిపిఒను కోరారు. రోడ్లు మరియు భవనాల శాఖ పై జరిగిన చర్చలో ఎస్ఇ జాన్ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం రూ.11 కోట్లు కేటాయించిందని, త్వరలో పనులు చేపడతామని చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ చర్యలపై రైతుల్లో అవగాహన కల్పించాలని చైర్‌పర్సన్‌తో పాటు కంచిలి, కవిటి, సోంపేట జెడ్‌పిటిసి సభ్యులు కోరారు. సమావేశాల్లో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ